ప్రతి సోమవారం ఉచిత వైద్య శిబిరం



ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ లక్ష్మయ్య

శంషాబాద్ రూరల్: మండలంలోని పెద్దగోల్కొండలో సోమవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ముచ్చింతల్ శివారులో ఉన్న జిమ్స్ హోమియోపతిక్ వైద్య కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక సర్పంచ్ లక్ష్మయ్య వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని ఇక నుంచి ప్రతి సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఐశ్వర్య తెలిపారు. హోమియోపతి ప్రధాన్యతపై గ్రామస్తులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న పిఅండ్‌టి కాలనీ అసోసియేషన్ సభ్యులు

బండ్లగూడ: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు ప్రత్యేక చొరవ తీసుకోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పరుస్తానని రాజేంద్రనగర్ నియోజక వర్గ ఎమ్మెల్యే టీ. ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అబ్దుల్ హఫీజ్ ఖాన్ ఆధ్వర్యంలో పిఅండ్‌టి కాలనీ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోని వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ చైర్మన్ మహ్మద్ సఫీ, అధ్యక్షులు నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



మణికొండ: కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని శివాలయాలలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పుప్పాలగూడలోని నల్ల పోచమ్మ దేవాలయం ఆవరణలో ఉన్న శివాలయంలో భక్తులు లక్ష బిల్వార్చన సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులకు క్రమ శిక్షణ అవసరం

గోల్కొండ: నాయకులు, కార్యకర్తలకు క్రమ శిక్షణ అవసరమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో టోలిచౌకీ, నానల్‌నగర్, గోల్కొండ డివిజన్‌లకు చెందిన సీనియర్ మజ్లిస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మజ్లిస్ పార్టీపై నమ్మకం ఉంచి తనను కార్వాన్ ఎమ్మెల్యేగా మూడోసారి గెలిపించారన్నారు. ఈ గెలుపుతో ఓటర్లు మజ్లిస్ పార్టీని ఎంత ఆదరిస్తున్నారో స్పష్టమైందని ఆయన అన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయమని, దీని కోసం ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటామని తెలిపారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి గతంలో తాను నిర్వహించి ఇంటింటికి మజ్లిస్ పార్టీకి ఈ దఫా కూడా కొనసాగిస్తానని ఆయన పేర్కొన్నారు. అహ్మద్ బిన్ మోసిన్ బాకుల్కా, మతీన్ ఖాద్రీ, ఖదీర్ తదితరులున్నారు.

బాలికల వసతి గృహంలో సమస్యలు పరిష్కరించండి

గన్‌ఫౌండ్రీ: నిజాం కళాశాల బాలిక వసతి గృహంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాల ఎదుట విద్యార్థినులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ..బాలికల వసతి గృహంలో సమస్యలు విశలయతాండవం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన వసతులు లేకపోవడం వల్ల ఒక్క బెడ్డుపై ముగ్గురు విద్యార్థులు నిద్రించే పరిస్థితి అని కన్నీటి పర్యంతమయ్యారు. తమ సమస్యలను పరిష్కరించాలని ప్రిన్సిపల్ దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినప్పటికి ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రస్తుత యాజమాన్యాన్ని తక్షణమే మార్చాలని డిమాండ్ చేశారు. బాలికల వసతి గృహంలో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని కళాశాల అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆకట్టుకున్న ఇంద్రలోక్ ఫ్యాషన్ షో



గోల్కొండ: గోల్కొండ తారమతి–బారాదరిలో జరిగిన ఇంద్రలోక్ ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. సుచిరిండియా సీఈవో లయన్ కిరణ్ ఆధ్వర్యంలో ఈ ఫ్యాషన్ షోలో ఇంద్రలోకాన్ని తలపించింది. దేవకన్యల వేషంతో పాటు వివిధ రకాల దేవతల ఆయుధాలతో మోడల్స్ ఆకట్టుకున్నారు. ఫన్ డ్యాన్స్, పలువురు సినీ తారలు, మోడల్స్ ఆకట్టుకున్నారు. నటులు సాయికుమార్, అనూప్ రూబెన్స్, ఆర్పీ పట్నాయక్, సోహెల్ కన్నికా, మధుసుధన్ తదితరులు పాల్గొన్నారు.

మాట ఇచ్చాం.. నెరవేరుస్తున్నాం



బస్సులో మహిళలకు మిఠాయి తినిపిస్తున్న కార్పొరేటర్ పూజిత గౌడ్

హఫీజ్‌పేట్ : ఎన్నికల్లో ఇచ్చిన మాటను నెరవేరుస్తున్నామని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 6 గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం చందానగర్ బస్టాప్ నుంచి కార్పొరేటర్ పూజితగౌడ్, మహిళలతో కలిసి మిఠాయిలు పంచి మహిళలకు పథకాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘునందన్‌రెడ్డి, నల్ల సంజీవరెడ్డి, వీరేందర్‌గౌడ్, గఫూర్, యాదయ్య గౌడ్, ఖాన్, అధ్యక్షులు అలీ, నాయకులు జంగీర్, యాదగిరి, ఏకాంత్ గౌడ్, రాజన్, రవికుమార్, సురేష్, అనిత, సుధ, శాంత, సంగీత, కవిత, తన్వీర్ బేగం, లలిత తదితరులు పాల్గొన్నారు.



పేరుకుపోతున్న వ్యర్థాలు

- జాతీయ రహదారికి ఇరువైపుల వ్యర్థాల డంపింగ్
- ప్లాస్టిక్ కవర్లలో తెచ్చి పారబోస్తున్న వైనం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలు చెత్తచెదారాలు, వ్యర్థాలతో దుర్గంధభరితంగా మారిపోతున్నాయి. ప్రధానంగా హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి ఇరువైపుల చెత్తను డంప్ చేస్తున్నారు. ప్రజలు కవర్లల్లో తీసుకొచ్చి రోడ్లకు ఇరువైపుల చెత్త చెదారాలను వేసి వెళ్లిపోతున్నారు. దీంతో టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి పోలీస్ అకాడమీ వరకు రోడ్లకు ఇరువైపుల పూర్తిగా పేరుకుపోయిన చెత్త చెదారాలే కనిపిస్తున్నాయి. జాతీయ రహదారిపై ప్రయాణిస్తుంటే దుర్వాసన వస్తుందని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు.

వాహనాలలో తీసుకొచ్చి..

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారి పక్కన వేసే చెత్తచెదారాలను కవర్లల్లో తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. తమ ద్విచక్ర వాహనాలతో పాటు కార్లల్లో సైతం తీసుకువచ్చి వీటిని పారవేస్తున్నారు. తమ ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంటే చాలు మిగతా ప్రాంతాలంతా తమకేమి పట్టన్నట్లు వాహనదారులు వ్యవహరిస్తున్నారు. శివారు ప్రాంతమైన బండ్లగూడ జాగీరు మున్సిపాల్ కార్పొరేషన్ నుంచి ఉద్యోగాలకు వెళ్లే సమయంలో చెత్తను తీసుకొచ్చి పడేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన చేపట్టాలి...

రోడ్లపై చెత్త వేయకుండా కార్పొరేషన్ అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు వెల్లడిస్తున్నారు. ప్రధానంగా రోడ్లపై చెత్తను వేస్తున్న ప్రాంతాల్లో గార్డులు, పారిశుధ్య సిబ్బందిని నియమించి చెత్త వేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లపై మూగజీవాలు..

పేరుకుపోతున్న చెత్తచెదారాలను తినేందుకు మూగజీవాలు రోడ్లపైకి వచ్చి తిష్ట వేస్తున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా పెరిగిపోతోంది. రోడ్లపై మూగ జీవాలు తిరిగే సమయంలో అవి ప్రమాదాలకు గురవుతున్నాయి. పలు సందర్భాల్లో వాహనదారులు సైతం ప్రమాదాల భారినపడుతున్నారు.



రోడ్లపై వేసిన చెత్తచెదారాల వద్ద మూగజీవాలు ఇలా..

అధికారులు చర్యలు తీసుకోవాలి..

ఎప్పుడు రద్దీగా ఉండే జాతీయ రహదారి ప్రాంతంలో అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రహదారిలోనే ఇంత దారుణంగా చెత్తచెదారాలు, వ్యర్థాలు కనిపిస్తుంటే ఇక బస్తీలు, కాలనీలలో పరిస్థితి ఎలా ఉంటుందో అని అర్థం చేసుకోవచ్చని చెబుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు చొరవ తీసుకుని జాతీర రహదారి ప్రాంతంలో వ్యర్థాలు పేరుకుపోకుండా తగినచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

శోభాయమానంగా కార్తీక దీపోత్సవం

మణికొండ: కార్తీక దీపాలతో అలకాపూర్ టౌన్‌షిప్ ఎంజీ పార్కు శోభాయమానంగా మారింది. మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే టీ. ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలంతా కలిసికట్టుగా జరుపుకునే పండగలతో అందరికీ ఆనందం కలుగుతుందని, ఇలాంటి పండగలను క్రమం తప్పకుండా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, నాయకులు జితేందర్, శ్రీరాములు, లక్ష్మీనారాయణ, శ్రావణ్‌కుమార్, లత గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, మణికొండ అధ్యక్షుడు యాదగిరిలతో పాటు సభ్యుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ తదితరులు

'ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలుచేస్తాం'

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా నెరవేరుస్తుందని కార్వాన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్‌బిన్ మహ్మద్ అల్‌హాజరీ అన్నారు. సోమవారం ఆయన మెహిదీపట్నం, టోలిచౌకీ, కార్వాన్ తదితర ప్రాంతాల్లో మహిళల కోసం ఆర్టీసీ వారు ప్రవేశపెట్టిన మహాలక్ష్మి బస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా ప్రయాణికులతో మాట్లాడి మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కాగా మహిళలు గత రెండు రోజుల నుంచి తాము బస్సుల్లో ఉచితంగానే రాకపోకలు సాగిస్తున్నామని ఈ పథకంపై తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన నాలుగు రోజుల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు హామీలను పూర్తి చేశారని అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో ప్రతినిత్యం తాను పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులు మక్బూల్, అమ్జత్‌ఖాన్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న కార్వాన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్‌బిన్ మహ్మద్ అల్‌హాజరీ

ఆ బిరుదు ఇవ్వడం సంతోషంగా ఉంది



హీరోయిన్ అప్సరా రాణి

మాదాపూర్: మాదాపూర్‌లోని వి కన్వెన్షన్స్‌లో 'ఎమ్‌బీఎఫ్ '(మల్టీ బిజినెస్ ఫ్రాంచైజ్) మార్ట్ సోమవారం ప్రారంభమైంది. హీరోయిన్ అప్సరారాణి, 'బిగ్ బాస్' ఫేమ్ జస్వంత్ పడాల 'ఎమ్‌బీఎఫ్' మార్ట్‌ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా అప్సరా రాణి మాట్లాడుతూ నాకు మోస్ట్ గ్లామరస్ తెలుగు యాక్ట్రెస్ అని బిరుదు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం 'సీమాఫ్ గ్లోబల్' ఆధ్వర్యంలో ఓ ఫ్యాషన్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'ఎమ్‌బీఎఫ్' తెలుగు రాష్ట్రాల బిజినెస్ మెంటార్ శ్రీనివాస్ శరకడం, పిక్ పే ప్యాక్ బిజినెస్ హెడ్ పి.రాకేష్, 'హైదరాబాద్ ఈవెంట్స్' సందీప్ చారీ, ప్రముఖ వ్యాపారవేత్త ఎర్రమనేని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

శంషాబాద్ రూరల్: ఇష్టానుసారంగా వ్యర్థాల పారబోతపై 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'రోడ్డు పక్కనే వ్యర్థాల పారబోత' అనే కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం నర్కూడ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది చేత రోడ్డు పక్కన, వరద కాలువలో ఉన్న చెత్తను తొలగించారు. గ్రామస్థులు ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయకుండా పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెత్త సేకరణ సిబ్బందికి ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనర్సింహా సూచించారు. చెత్తను ఇష్టానుసారంగా పారబోస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

చెత్తను రోడ్లపై వేయొద్దు

- వీధి వ్యాపారులు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలి
- వెస్ట్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

గచ్చిబౌలి: వీధి వ్యాపారులు తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉప కమిషనర్ రంజిత్‌రెడ్డితో కలిసి శేరిలింగంపల్లి సర్కిల్ శానిటేషన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులతో పాటు షాపుల వద్ద డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులకు సూచించారు. వ్యాపారులు ఎక్కడపడితే అక్కడ రోడ్లపై చెత్త వేయడంతో దుర్గంధం వస్తుందన్నారు. ప్రధాన రోడ్లపై చెత్త కుప్పలు కనిపిస్తున్నాయని, వ్యాపార సంస్థలు విధిగా బిన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఐటీ కారిడార్‌లో వీధి వ్యాపారులు, హోటళ్లు ఎక్కువగా ఉండటంతో చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంఅండ్‌హెచ్‌ఓ నగేష్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లగండ్లలో డిప్యూటీ కమిషనర్ పర్యటన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి సోమవారం పర్యటించారు. నల్లగండ్ల, లింగంపల్లి, గోపన్‌పల్లిలలో పలు కాలనీలు, రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ చెత్తను ప్రతి ఒక్కరు స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని సూచించారు. ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలు ప్రజలకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా స్ట్రీట్ వెండర్స్, షాపుల నిర్వాహకులు డస్ట్‌బిన్స్‌ను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయా వ్యాపార సముదాయాల వద్ద చెత్త వేస్తే వారు బాధ్యులవుతారని, చెత్త రోడ్డు మీద వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కార్తీకమాస వన భోజనాలు

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలోని ఆరంభ టౌన్‌షిప్‌లో సోమవారం ఘనంగా కార్తీకమాస వన భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ హాజరయ్యారు. వన భోజన కార్యక్రమంలో కాలనీవాసులకు భోజనాలు వడ్డించారు. బీఆర్‌ఎస్ నాయకులు రాజు యాదవ్, శ్రీనివాస్ యాదవ్, మల్లేష్‌గౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, రమేష్, రవీంద్ర రాథోడ్, రాజేష్, సరిత, అరుణశ్రీ, స్వాతి, విశాలాక్షి, మానసారెడ్డి, మాలిక, నాగరాజు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోసు కిరణ్

అత్తాపూర్: సెల్‌ఫోన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడే అవకాశముందని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోసు కిరణ్ అన్నారు. రాజేంద్రనగర్ పట్టణ పరిధిలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ నరసింహ, ఎస్సై రాజేంద్రనగర్ టీమ్‌తో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్‌లకు వాహనాలు ఇవ్వకూడదని ప్రతి వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. రహదారుల్లో ట్రిబుల్ రైడింగ్ చేస్తూ డివైడర్ల వద్ద, స్పీడ్ బ్రేకర్ల వద్ద శరవేగంగా వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయకూదని ప్రయాణికులకు సూచించారు.

మంత్రి జూపల్లి కృష్ణారావుకు సన్మానం



అత్తాపూర్: అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో పూర్తి సహకారం అందిస్తానని పర్యాటక సాంస్కృతిక పురావస్తు శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అత్తాపూర్ గ్రామానికి చెందిన పాశం మధుసూదన్ రెడ్డి, మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో అత్తాపూర్ అంబియన్స్ పోర్టులోని మంత్రి నివాసంలో పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు ప్రాంతాలకు అతీతంగా అభివృద్ధి చేయడం తన లక్ష్యమని తెలిపారు. యాదగిరి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల గోదాంలో అగ్నిప్రమాదం



గోదాంలో ఎగసిపడుతున్న మంటలు

మైలార్‌దేవ్‌పల్లి: ప్లాస్టిక్ వ్యర్థాల గోదాంలో అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మధు తెలిపిన వివరాల ప్రకారం బాబుల్‌రెడ్డినగర్ లోని టాటానగర్ ప్రాంతంలో గత కొంత కాలంగా ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన గోదాంలు ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు అకస్మాత్తుగా ఓ ప్లాస్టిక్ గోదాంలో దట్టమైన పొగతో భారీగా మంటలు చెలరేగాయి. ఘటన స్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది నాలుగు ఫైర్ ఇంజన్‌లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదని రూ.8లక్షల ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని తెలిపారు.

అందరికీ అందుబాటులో ఉంటా

గోల్కొండ: అందరికీ అందుబాటులో ఉంటూ అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. సోమవారం ఆయన మెహిదీపట్నం పద్మనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగర మేయర్‌గా, అహ్మద్‌నగర్, మెహిదీపట్నం కార్పొరేటర్‌గా ప్రజలు తనను ఎన్నుకున్నారన్నారు. తన పనితీరును మెచ్చుకున్న ప్రజలు తనను నాంపల్లి ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. పేదలు నివసించే ప్రాంతాలను ఎక్కువ ఫోకస్ చేసి ఆ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఆయన అన్నారు. మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తనపై నమ్మకం ఉంచి నాంపల్లి టికెట్ ఇచ్చారన్నారు.

'నాణ్యమైన ఉత్పత్తులు అందిస్తాం'



గన్‌ఫౌండ్రీ: వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే తమ లక్ష్యమని గ్రోయింగ్ స్టార్ జువెల్లరీ చైర్మన్ మహేష్ జాజు తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్, సికింద్రాబాద్‌లో నూతన షోరూమ్‌లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నేటి వరకు ఐదు షోరూమ్‌లను ప్రారంభించామని రాబోయే రోజుల్లో మరింత విస్తరిస్తామని తెలిపారు. సిల్వర్ కింగ్‌డమ్ నాణ్యతకు మరోపేరు అని ఆ నమ్మకాన్ని వినియోగదారుల వద్ద నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు. ఐబీజేఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రా శ్రీనివాసరావు, బూర్గు సూర్యప్రకాష్ రావు, సురేష్ కొటాటి పాల్గొన్నారు.

సాంకేతిక విద్యాభివృద్ధికి సహకారం అందించాలి

విజయనగర్‌కాలనీ: రాష్ట్రంలో సాంకేతిక విద్యాభివృద్ధికి ప్రభుత్వం సహకారాన్ని అందించాలని తెలంగాణ గెజిటెడ్ పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.నర్సయ్య గౌడ్ కోరారు. మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని అసోసియేషన్ హాల్‌లో సోమవారం టీజీపాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ చక్రవర్తి, కోశాధికారి బి.రాజ తదితర సభ్యులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ పోరాటంలో తమతో పాటు విద్యార్థులతో కలిసి సమష్టిగా చేసిన పోరాటం మరువరానిదన్నారు. పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులకు త్వరితగతిని ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వై.కృష్ణ, డి.వెంకటేశ్వర్లు, డాక్టర్ కె.చంద్రశేఖర్, వి.సురేష్, పి.ఆనంద్, కె.వెంకన్‌గౌడ్, కె.వినోద్‌కుమార్, జి.విజయ్‌కుమార్, బి.కృష్ణవేణి, జి.రజితదేవి, డాక్టర్ ఎం.సునిత, జి.దీపికారెడ్డి పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నాంపల్లి రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సనత్‌నగర్–భరత్‌నగర్ రైల్వే స్టేషన్ల మధ్యలో ఓ గుర్తు తెలియని వ్యక్తి(35) రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామ నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటును ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈ-పెట్టీ కేసులో ఇద్దరికి జైలు

అబిడ్స్: ఈ–పెట్టీ కేసుల్లో నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు వ్యక్తులకు న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ షేక్ ముజీబ్ ఉర్ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం..సత్యనారాయణ కాలనీలో నివసించే విజయ్ సింగ్‌కు రెండు రోజుల జైలు శిక్ష, డి.చంద్రమోహన్‌కు ఒక్కరోజు జైలు శిక్ష విధిస్తూ 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ సత్యనారాయణ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ ముజీబ్ ఉర్ రెహ్మాన్ మాట్లాడుతూ..వ్యాపారస్థులు కానీ, హోటళ్ల నిర్వాహకులు, ఇతర వాణిజ్య సముదాయాల వారు తప్పనిసరిగా పోలీసు నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ–పెట్టీ కేసుల్లో జైలు శిక్ష విధిస్తున్నారని ప్రతి ఒక్కరూ చట్టబద్ధతతో మెలగాలన్నారు.